# భీష్ముడి పెళ్ళి

పడకకుర్చీలో నడుంవాల్చి సిగరెట్ కాలుస్తూ, ఆలోచిస్తున్నాడు ప్రభాకరం. పెళ్ళిచేసుకొన్న తన స్నేహితుల్ని ఒక్కొక్కర్నే జ్ఞాపకానికి తెచ్చుకుంటున్నాడు.

'సూర్యచంద్రరావుకు పెళ్ళయి నాలుగేళ్ళన్నా కాలేదు. అప్పుడే ఇద్దరు పిల్లలు. మూర్తి పెళ్లయిన ఏడాదికే పిచ్చివాడయిపోయాడు. సుభద్ర పెళ్ళయిన ఆరేళ్ళకు, అత్తతో పోట్లాడి, బావిలో పడి చచ్చిపోయింది. కాంతమ్మక్క ఒక జీవచ్ఛవం! సుబ్బరామయ్య అల్లుడు ఆయన కూతుర్ని పెళ్ళిచేసుకొన్న పాపానికి ఆయనకు బానిసగా పనిచేస్తున్నాడు. అతణ్ణి చూస్తే యెవరికైనా జాలేస్తుంది. కానీ అతను మాత్రం తను సుబ్బరామయ్యంతటి ఘరానామనిషి అల్లుడిననే గర్వంతో మురిసిపోతూ వుంటాడు. ఆ గొప్పకోసమే అంత అపవా చాకిరీచేస్తూ కూడా తృప్తిపడుతున్నాడేమో! ఆ పెళ్ళి చేసుకోనప్పుడు, అతను ఎవరికీ లొంగని పొగరెక్కిన ఆంబోతులాంటివాడు. బాబాయి కూతురు సరోజ పెళ్ళవకముందు ఉత్సాహంతో త్రుళ్ళిపడుతూ వుండేది. ఇప్పుడు నలుగురు పిల్లల్ని కనేసి పిచ్చెత్తిన స్కెలిటన్‌లా తయారయింది. ముష్టిది కూడా ఇంతకన్న మంచి బ్రతుకే బ్రతుకుతుంది. తను మనిషినేననే విషయం ఎప్పుడూ మరచిపోదు. ప్రాణంమీద ఆశతో, ఆత్మవిశ్వాసంతో నడుస్తూ వుంటుంది. సరోజ నడుస్తూవుంటేగా చూస్తే కడుపులో ప్రేవులు డోక్కుంటాయి. హఠాత్తుగా కళ్ళు తిరిగి క్రిందపడాల్సివస్తుంది. ఇలా ఎందరైనా వున్నారు.

వీళ్ళందర్నీ చూస్తూకూడా యెలా పెళ్ళి చేసుకోవటం? మనిషి జీవితం అర్థంకానంత వరకు పెళ్ళిచేసుకోకూడదు అలా అనుకుంటే జీవితం ఎప్పటికీ అర్థమయ్యేలా లేదు. నిజానికి తనలాంటివాడు పెళ్ళికి అనర్హుడు.

తన సంపాదన తనొక్కడికే చాలదు. తను పెళ్ళిచేసుకొని కాపురంపెడ్తే, ఇద్దరూ కష్టాలనుభవించాల్సిందే. తెలిసి, కావలసి కష్టాల్లో ఇరుక్కోవడ మెందుకు? పెళ్ళయి పిల్లలుపుట్టి, సంసారం పెద్దదయి, జీతం చాలకపోయి, అకారణంగా మనసు చెడిపోయి, నిత్యం ఇంట్లో పోట్లాడుతూ, చికాకుపడుతూ, ఇంటిని, జీవితాన్ని నరకంగా చేసుకోవడ మెందుకు?

ఒక్క ఆర్థిక కారణాలే కాదు. ఆ వచ్చే భార్య అనుకూలవతే అవుతుందని గ్యారంటీ ఏముంది? పోనీ తనైనా, బుద్ధిగా దయగా స్నేహంగా వుండబోతాడా? అప్పటికి తనూ దుర్మార్గుడు కావచ్చు. ఎంతమంది మారిపోవటంలేదు పరిస్థితులు ఎంతమందిని క్రూరుల్ని చేయడంలేదు.

తనభార్యకు తను అర్థంకాక పోవచ్చు. తన అలవాట్లు నచ్చకపోవచ్చు. తన 'జీవనస్థాయి' ఆమెకు తగ్గకపోవచ్చు. తనముఖం ఆవిడకు వికృతమూ,భయంకరమూ కావచ్చు.

**రాజేంద్ర**

ఆమెమాటా తీరూ తనకు నచ్చకపోవచ్చు. ఏది ఇష్టపడకుండా తప్పనిసరయి. 'ఎడ్జెస్ట్' అయి ఒకసీటులో ఇద్దరు ప్రయాణికులు ఇరుక్కు కూచున్నట్లు ఏంజీవితమది? రోత...కంపు...! ఎందుకలాంటి దాంపత్య జీవితం! పెళ్లి చేసుకోవడమంటే, శాంతిని, ఖూనీ చేయడమే అవుతుంది. పెళ్లి చేసుకొని కలతలతో, కష్టాలతో, క్రుళ్లిపోతున్న జీవితాలు వందలు, వేలు కనిపిస్తున్నాయి. ఎక్కడో షికారెళ్ళే కొత్తదంపతులు కనిపిస్తారు—నవ్వుతూ. త్రుళ్ళిపడుతూ...! వాళ్లు గతకాలపు జీవితాలకు నమూనాలు. లేదా రాబోయే శుభదినాల జీవితాలకు నమూనాలు. అంతే. వాళ్లయినా ఎన్నాళ్ళలా వుంటారు...సమస్యలు మీదపడి నలిపి నాశనం చేయవా?...వాళ్ళ ఆనందాన్ని మ్రింగి, జీవితాన్ని ధ్వంసం చేయవా?

ముఖ్యంగా తనలాంటి మధ్యతరగతి వ్యక్తి పెళ్ళి చేసుకొని పిల్లలు కనడానికి అనర్హుడు. ఇప్పుడు కాలం కొంత ప్రశాంతంగానే గడిచిపోతోంది. దాన్ని నాశనం చేసుకోవడ మెందుకు? ఎవరెంత బలవంతం చేసినా లొంగకూడదు. మిత్రులతో ఇదే చెప్పాడు. తను పెళ్ళి చేసుకోనుగాక చేసుకోనని అరిచాడు. వాదించాడు. స్నేహితులూ వాదించారు. దాంపత్యజీవితంలో ఎంత ఆనందం, ఎంత ప్రశాంతత వుందో ఉదాహరణలతో మహామహుల మాటలను ఉటంకించి, వివరించారు. శృంగారజీవితంలో మానవుడు అందుకొనే ఆనందపు టంచులను వూహించలేవన్నారు. కుటుంబజీవితంలో మనిషికి లభించే ప్రశాంతత, తృప్తి ఇంతింత కాదన్నారు. పురుషార్థాలలో కామమొకటి గనుక పెళ్ళి చేసుకొని పిల్లల్ని కనడము పురుషునిధర్మమని దానినతిక్రమించడం పాపమని, హెచ్చరించి, వినాశానికి లోను కావద్దని ఉపదేశించారు. బ్రహ్మచారి ఏయే పాట్లు పడాల్సివుంటుందీ చిలవలు పలవలుగా చెప్పి భయపెట్టి చూశారు. జుట్టూజుట్టూ పట్టుకునేవరకు వాదించుకున్నారు. రోజుల తరబడి అలా వాదోపవాదాలు జరిగాయి. తేలింది సున్న! వాళ్ల అభిప్రాయాలు వాళ్లవే అయినవి. తన నిశ్చయం తనదే అయింది.

దరిమిలా ఉద్యోగంలో ప్రవేశించిన తర్వాత కూడా ఎన్నో జీవితాల్ని తను పరిశీలించాడు. భార్యాభర్తలమధ్య కలతలు... అనుమానాలు, ఆర్థికపు వొడిదుడుకులు, అభిప్రాయభేదాలు, అభిరుచుల్లో భేదాలు, ఆత్మల అంతరాలు, భిన్నస్వభావాలు, ఒకరిపనికి, ఒకరిమాటకు ఒకరు అడ్డుపడటం, కలహించుకోవటం, మానసిక ఆందోళనకు గురికావటం, పిచ్చెత్తడం...అత్తాకోడళ్ళ పోట్లాటలు, ఇల్లంటే భయపడే మగవాళ్ళు, పుట్టింటికి పారిపోయే ఇల్లాళ్ళు; భర్తల్ని విషంపెట్టి చంపేసేభార్యలు, భార్యల్ని ఖూనీచేసే భర్తలు...ఒకరిబంధువుల్ని ఒకరు అవమానపరచటం, పిల్లల్ని పెంచలేకపోవడం, వాళ్ళను సరయినమార్గంలో పెట్టలేక 'జాతి'ని నాశనంచేస్తున్న పాపాత్ములు; తమపిల్లల్ని రౌడీలుగా, దుర్మార్గులుగా, అవమరులుగా, పిరికిపందలుగా, కురూపులుగా, కుత్సితులుగా, చచ్చులుగా తయారుచేస్తున్న తల్లిదండ్రులు...వ్యభిచారులు, తండ్రులు తెలీని పిల్లలు, తల్లులే తెలీని పిల్లలు, ఎన్ని

# ★ భీష్ముడి పెళ్ళి ★

యెన్నియెన్ని... యెన్నెన్ని, యెన్నెన్ని..." అతనిబుఱ్ఱ వేడెక్కింది. మరోసిగరెట్ ముట్టించాడు.

*　　*　　*

రోజులు గడిచాయి ప్రభాకరం పెళ్ళిచేసుకోలేదు. చేసుకోవాలనే ఉద్దేశమూ కలగలేదు. స్నేహితులు, బంధువులు, ఆడపిల్లల తండ్రులు...తమ ప్రయత్నాలు విరమించలేదు. 'యోగ్యుడైన' ఒక యువకుడు బ్రహ్మచారిగా వుండిపోవడం 'సంఘ' దౌర్భాగ్యమని ఎంచిన పెద్దలిద్దరు వారంరోజులు అదేపనిగా ప్రభాకరంమీద దండెత్తి...ఓడిపోయి, పారిపోయారు. మిత్రుడొకడు ఒకోసారి 'దస్తా' కాగితాల్లో ఉత్తరాలురాసి, ఆఖర్న, ఆ ఉత్తరాలను అతను చించి చూడటమే లేదని తెలుసుకుని, తనను తాను నిందించుకొని తోక ముడుచుకొని వూరుకొన్నాడు.

ప్రభాకరం ప్రసిద్ధుడయ్యాడు. 'బ్రహ్మచర్యం' ఎంత ఆరోగ్యకరమైనదో, ఎంత మంచిదో వివరిస్తూ, వివిధ పత్రికలలో వ్యాసాలు, నాటకాలు రాసి ప్రచురించి, ప్రదర్శింపించాడు. ఉపన్యాసాలిచ్చి అనేక యువ బ్రహ్మచారులకు ప్రోత్సాహం కలగజేశాడు. అనేక దూషణ, తిరస్కారాలను ఎదుర్కొన్నాడు. వాటిని ఖాతరు చేయకుండా నిబ్బరంతో తన దీక్షను నిలుపుకొన్నాడు ప్రభాకరం.

క్రమంగా అతని 'సర్కిల్' వేరయిపోయింది. బంధువులు, ఆత్మీయులు, హితులు...దూరమై ఒక కొత్తవర్గం అతని చుట్టూ చేరింది. క్రమంగా 'పెళ్ళినిగురించి' 'జీవితాన్ని' గురించి ఆలోచించడం మానేసి, తను ఏర్పరచుకొన్న అభిప్రాయాల్ని ప్రచారంలోకి తీసుకురావడానికి మాత్రమే కాలాన్ని వినియోగిస్తూ వుండిపోయాడు.

*　　*　　*

ఒకరోజు సెలవునాడు ప్రొద్దుట, కాఫీ త్రాగి కిళ్ళీనములుతూ కూర్చున్నాడు ప్రభాకరం. పడక్కుర్చీ అనే కనకపు సింహాసనం మీద విజయవంతుడైన 'బ్రహ్మచారి చక్రవర్తి' కూర్చున్నాడు. అప్పుడే పోస్టుమన్ ఒక కార్డు తెచ్చిచ్చి త్వరత్వరగా నడిచి వెళ్ళిపోయాడు. ప్రభాకరం తనకూ పెళ్ళి చేసుకోవద్దని సలహాయిచ్చి, వో ప్పుకోకపోతే తంతాడని కాబోలు అతను పారిపోయాడు! ప్రభాకరం అతని కంగారుచూసి నవ్వుకుంటూ, కార్డులోని గుండ్రని అందమైన అక్షరాలమీదికి దృష్టి సారించాడు.

"డియర్ భీష్ముడూ,

భయంభయంతో నీకీ ఉత్తరం రాస్తున్నాను. ఇక్కడికొచ్చి తంతావేమో నని భయం! నేను లక్షణంగా పెళ్ళి చేసుకొన్నానని వినయంతో విన్నవిస్తున్నాను. క్షమించు...అందరిలాగే నేనూ నీకు శుభలేఖ పంపలేదు. నువ్వు శుభలేఖలుచూసి చాల వీళ్ళయింపనుకొంటాను.

నాకు ఈ వూరు బదిలీ అయింది. నువ్వు మరికొంత దగ్గరయ్యావు! మా శ్రీమతి ఇప్పుడు ఇక్కడే వుంది. నువ్వోకసారి మా యింటికి రావలసిందిగా కోరుతూ ఆహ్వానిస్తున్నాము. వీలయినంత త్వరగా బయలుదేరి రాగలవని నమ్ముతాను.

నీ, కృష్ణమూర్తి."

టక్కుమని లేచాడు ప్రభాకరం. పర్సు తీసి జేబులో వుంచుకొని ఇంటికి తాళంవేసి వీధిలోకి వచ్చాడు. పరుగెడుతున్న రిక్షాను కేకవేశాడు "అరరూపాయ్ ఎక్కువిస్తాను. త్వరగా పోనివ్వమన్నాడు. రిక్షావాలా తల 'ఠక్' అన్నట్లు వూపాడు రిక్షాఎక్కాడు రిక్షా తారురోడ్డుమీద జారుతూ తుఱ్ఱుమంది.

*　　*　　*

తన ఎదుట నిటారుగా నిల్చున్న ప్రభాకరాన్ని చూసి నిజంగా మూర్ఛపోయాడు కృష్ణమూర్తి. ప్రభాకరం కంగారుపడి, నీళ్ళకోసం ఏదో కంటుగదివంటిగది కనిపిస్తే పరుగెత్తాడు అక్కడో సుందరాంగి తనలో తాను రాగం తీసుకొంటూ, సన్నగా నవ్వుకొంటూ కూర్చుని, ఎఱ్ఱని టొమేటో పళ్ళ తోలు తీస్తూ వుంది ఒక్క నిముషం నిలిచి ఆ ఎఱ్ఱని వేళ్ళ కదలిక గమనించి, ముందుకురికి, గ్లాసుతో నీళ్ళు తీసుకొన్నాడు ఆ అమ్మాయి హడలిపోయి వెనక్కి పడిపోయింది.

నీళ్లు తెచ్చేసరికి కృష్ణమూర్తి లేచేశాడు.

జాలిగా మిత్రుడికేసి చూశాడు. ప్రభాకరం నవ్వాడు. కృష్ణమూర్తికూడా నవ్వుతూ లేచి ప్రభాకరం చేతులు పట్టుకొన్నాడు.

"ఇదిగో మా ప్రభాకరం"—అన్నాడు కృష్ణమూర్తి, దూరంలో బెదురుతూ గోడకు


FPT. 26-TEL



'నా గొంతుక బాగా పుండు పడినందున నేనుమ్రింగలేక పోయాను'

కాని పెప్స్

ఉపశమనం కలిగించి పుండును మాన్పినవి




పెప్స్ టేబ్లెట్లు గొంతు, రొమ్ము బాధోపశమన, నివారకసారములు కలవి, మీరు పెప్స్‌ను చప్పరించునపుడు ఈ సారములు ఆవిరి అయి, మీ శ్వాసద్వారా గొంతుకలోనికి, శ్వాసమార్గం, శ్వాసకోశాలలోనికి కొనిపోబడుతాయి. ఇలా అవి సరాసరి మిమ్ము బాధించే భాగాలను చేరుకుంటాయి. అందుకే పెప్స్ అంతశక్తివంతమై, జగద్విఖ్యాతి గాంచినవి. పెప్స్ దగ్గులను అణిచివేస్తాయి, గొంతు పుండు బాధను ఉపశమింప జేస్తాయి, కఫమును కోసివేసి, శ్వాసబాధను పోగొట్టుతాయి. ఇన్‌ఫ్లుయేంజా, బ్రోంకైటిస్ చికిత్సకు ఇవి అమోఘమైనవి.

**PEPS**

పెప్స్ గొంతు, రొమ్ము టేబ్లెట్లు.
మందులమ్మేవారి అందరివద్దా లభిస్తాయి.

సోల్ ఏజెంట్లు : దాదా & కంపెనీ, 86 నైనప్పనాయక్ వీధి, మద్రాసు-1.

అంటుకు పోయి నిల్చున్న తన భార్యకేసి నవ్వుతూ చూస్తూ!.

"ఎవరో అనుకున్నా! నిజంగా హడలి పోయాను. కూర్చోండి. ఇద్దరూ చాలమంచి పనిచేశారు గానీ...ఒక్క నిముషం కూర్చు న్నారంటే, కాఫీ యిచ్చేస్తాను" అని ఆమె లోపలికి వెళ్ళింది.

మిత్రు లిద్దరూ కూర్చున్నారు.

"ఇంత హఠాత్తుగా దిగుతావనుకోలేదు. అయితే తప్పకుండా వస్తావనిమాత్రం అను కున్నాం. ఎందుకంటే పెళ్ళయిన స్నేహి తులమీదేగదా...నీ పరిశోధనలు! అందు కని తప్పకుండా వస్తావనుకొన్నాను. ఏమిటి విశేషాలు. ఇంకా బ్రహ్మచారిగానే వుండి పోవా లనుకొంటున్నావా" అన్నాడు కృష్ణ మూర్తి.

ప్రభాకరం మాట్లాడ లేదు. చిరునవ్వు నవ్వాడు. బల్లమీది సిగరెట్ టిన్‌నుంచి ఓ సిగరెట్ తీసి వెలిగించాడు. కృష్ణమూర్తికొకటి అందిచ్చాడు. అతను తీసుకోలేదు.

"ఈమధ్య సిగరెట్లు తగ్గించేశాను. ఇంకా తగించేస్తాను..."అని ప్రభాకరం కళ్ళలోకి చూశాడు.

"ఇంకా...మానేస్తాను. గొప్ప నీతిమంతు డ్నయిపోతాను...చచ్చిపోతాను..." అని పూర్తిచేశాడు ప్రభాకరం.

"చచ్చాం! ధోరణి ఇంకా ఏం తగ్గలే దన్న మాట! సరె సరే ..అయితే మమ్మల్ని చంపేస్తావ్! నువ్వు పూరికే వదిలేరకం కాదు" అన్నాడు కృష్ణమూర్తి.

ప్రభాకరం సిగరెట్ పీలుస్తూ, పైకి రింగు రింగులుగా పొగ వదులుతూ, దాన్నే చూసు కొంటూ. అప్పుడప్పుడూ చిరునవ్వుచిందిస్తూ వుండిపోయాడు. కృష్ణమూర్తి మధ్యలో ఒక సారి ఏదో అనబోయి, వూరుకున్నాడు.

ఒక పెద్దపళ్ళెంలో మంచినీళ్ళు, కాఫీ గ్లాసులు వుంచుకొని జానకీదేవి నెమ్మదిగా వచ్చింది. పళ్ళెం బల్లమీద వుంచగానే కృష్ణ మూర్తి మంచినీళ్ళగ్లాసు అందుకొని గడగడా తాగేశాడు. అతనికి మంచినీళ్ళే ప్రాణం! జానకీదేవి తన కాఫీ గ్లాసు తీసుకొనివెళ్ళి కూర్చుంది. ప్రభాకరం' కృష్ణమూర్తి కాఫీ అందుకొన్నారు.

కాఫీ త్రాగడం పూర్తయింది. కృష్ణ మూర్తి జానకీ నవ్వుకొంటూ త్రుళ్ళుతూ వున్నారు. అక్కడ ఆనందం పరవళ్ళు త్రొక్కుతోంది. ఎప్పుడూ తీవ్రంగా ఆలో చిస్తూ వుండే ప్రభాకరం ఇక్కడ వీళ్ళ మాటలలో కలిసిపోయాడు.

ఆ రాత్రి భోజనాలు తర్వాత పన్నెండు వరకు పిచ్చాపాటీ మాట్లాడుకున్నారు. మాటలమధ్యలో జానకి తనచెల్లెలు సుజాత రేపు ఉదయం మద్రాసునుంచి వస్తోందని చెప్పింది

జానకీదేవి చెల్లెలు సుజాత ఇంటర్ మీడి యట్ పాసయి. ఇక చదివే అవకాశంలేక, ఇంట్లో కూర్చుని పుస్తకాలతో కుటతో కాలక్షేపం చేస్తోంది. 'ఆ పిల్ల చాల చలాకీ అయినదని' ఆమె చెప్తావుంటె ప్రభాకరం. చెవులప్పగించి విన్నాడు. జానకీదేవే అతనికి చాలహుషారయిన అమ్మాయిగా కనిపిస్తోంది. ఇంకా ఆ చిన్నపిల్ల ఎంత చలాకీగా వుండాలో మరి... అనుకొన్నాడు... ఏదో క్రొత్తలోకంలో ప్రవేశిస్తున్నటనిపించింది.

ఉదయం జానకీదేవి చెల్లెలు సుజాత దిగింది. ఆమె రాకతో ఆయింటి కళ ఎక్కు వయింది. నవ్వులూ, మాటలూ ఎక్కువ య్యాయి.

కృష్ణమూర్తికి ఆవేళ సెలవురోజు. ఇంట్లోనే వుండిపోయాడు. సుజాత భావ దగ్గర్నుంచి కదలలేదు. అక్కడే కూర్చుని కబుర్లు చెప్పసాగింది. జానకి వంటగదినుంచి అప్పుడప్పుడూ వచ్చి, వాళ్ళ మాటల్లో కల్పిం చుకొంటోంది ప్రభాకరానికి వాళ్ళ మాటలు చాలసేపటివరకు సరీగా బోధపడలేదు. కానీ వింటూవుంటే హాయిగావుంది. నవ్వులు, చమత్కారాలు... ఏవేవో గమ్మత్తయిన విషయాలు 'ఇదా జీవితం' అనుకొన్నాడు. అతనిమీద దేవతలు పన్నీటి జల్లు కురిపిస్తున్న ట్లుంది. శరీరం పరవశమై ఆనందంగావుంది.

నీరసత్వంగానీ, మనస్సులో తీవ్రతగానీ ఏమీ లేవు. అంతా ప్రశాంతం!

ఆ రోజంతా గడచిపోయింది. ఆ సాయం కాలం ఊరవతలికి షికారు వెళ్ళారు. ఊరవ తల ప్రక్కప్రక్కనే రెండు చెరువులు న్నాయి. చెరువుల్లో దాదాపు నిండుగా నీళ్లున్నాయి ఒక ప్రక్క మామిడితోటలు. ఒకప్రక్క తారురోడ్డుమీద కార్లు, బస్సులు బర్ మని జారుతూ పోతున్నాయి. నలుగురూ అలా నడుస్తున్నారు. చెరువుకట్టమీద నడుస్తూ, చెరువునీళ్లలో కదలాడే నీడల జాడలు, సూర్యుని కిరణాల రంగులు... చూస్తూవుంటే హాయిగావుంది. మనసుకు ఎంతో 'ఇంపు'గా వుంది. సుజాత మాట్లాడు తోంది.

"మీరు బ్రహ్మచర్యం ఎంతకాలం సాగి స్తారండీ. అయితే వేషరుగారూ! మీరు ఎందుకలా వుండిపోవాలనుకొన్నారూ? ఆడవాళ్ళంటే భయమా? జీవితమంటే పిరికి తనమా? లేకపోతే ఎక్కడైనా విఫలులై ..?"

"ఏం లేదు... ఏం లేదు. అదేం లేదండి. ఉటినే" అన్నాడు దిగులుగా ప్రభాకరం.

"ఫరవాలేదు—చెప్పండి. అంతమంది దగ్గర బల్లగుద్ది వాదించారు. వ్యాసాలు రాశారు. గంభీరోపన్యాసాలు చేశారు. హేమాహేమీల ముందు మీ 'వాదం' నెరి గించి "భేష్ అనిపించుకొన్నారు. నాతో చెప్పలేరా!" అంది సుజాత.




# ★ భీష్ముడి పెళ్లి ★

అదో సవాల్ అతనికి!

'అవును తను చెప్పలేదు. ప్రపంచంలో ఎవరి ముందైనా రొమ్ము విరుచుకొని నిలబడి ఇదీ నా వాదం. అని తన ధీరత్వాన్ని చాతుర్యాన్నీ కూడా ప్రదర్శించి తన వాదం వాళ్లి కామోదయోగ్యంగా కనిపించక పోయినా సరే "భేష్" అనేలా చేయగలడు. కానీ ఆమె ముందు తను చాల బలహీనుడయి పోతున్నాడు. తన వాదన నోట్లోకి రావడం లేదు. మస్తిష్కంలో వేడిలేదు. నరాల్లో మటుకు కదలిక కనిపిస్తోంది.

మౌనంగా చెరువు నీళ్ళ అలలలో ఆడుతున్న నీడల్ని తిలకిస్తున్నాడు. సుజాత రెండు నిముషాలు ఊరుకొని మళ్ళి సాగించింది! తనెరిగిన బ్రహ్మచారుల్ని గురించి చెప్తోంది. కృష్ణమూర్తి, జానకీదేవి...ముందు దూరంలో నడుస్తున్నారు. ప్రభాకరం సుజాతా వెనకబడిపోయారు. సుజాత అతనితో చనువుగా దగ్గరగా మాట్లాడుతోంది. కంఠంలోంచి గాంభీర్యము, మృదుత్వము మధురత్వము అన్నీ సమపాళ్ళలో కలిపి వొలకబోస్తోంది.



పంటకళ్లంలో ధాన్యం తూర్పార

—ఫోటో : ఎ. వి. రామమూర్తి.

"మేమంతా మొన్న ఒక సినిమాకు వెళ్ళాము అందులో కథానాయకుడు..." ఆ సినిమా కథంతా చెప్పుకుపోతోంది సుజాత. ఎందుకు చెప్తోందో అనుకుంటూ శ్రద్ధగా విన్నాడు ప్రభాకరం. వింటున్నంత సేపూ అతనీ ప్రపంచంలో లేడు. సుజాత మాటలు అతనికి కితకితలు పెడ్తోంది. కొత్త అనుభవం!

"మరి... నేను నడవలేను తిరిగిపోదాం" అంది సుజాత:

"నేను నీతో ఎంత దూరమైనా సరే నడవగలను. అడవులు, కొండలు, గుట్టలు, సముద్రాలు అవలీలగా దాటేస్తాను. నువ్వు ప్రక్కనుండి మాటాడుతూ వుంటే చాలు. అంతెందుకు నువ్వు ప్రక్కనున్నావనే 'భావన' చాలు నడవటానికి శక్తినిస్తుంది. కానీ నిన్నలా 'కంటకపు రస్తా' వెంట నడవనిస్తానా..." అని మనసులో అనుకొన్నాడు ప్రభాకరం. మరుక్షణంలో అతనికే ఆశ్చర్యం కలగ జేసింది. తను మునపటి ప్రభాకరం కాకుండా మరెవరో అయిపోతున్నాడు. ఇలాంటి తలపులు, ఇంత కవిత్వం కమ్మని భావాలు ఇదివరకు అనుభవంలో

---

తండ్రి : ఏరోయ్! నీవు పంతులికే పంగనామాలు పెడ్తున్నావుటగా!

కొడుకు : అబ్బే! లేదండి! ఆయన వైష్ణవులు. ఆయనే రోజూ ప్రొద్దున్నే పంగనామాలు పెట్టుకొని బడికి వస్తుంటారు.

* * *

యజమాని : టైరుకూడా బాగా లేదు. అంత స్పీడుగా వెళ్తున్నావ్! టైరు పగిలిందంటే కారు తలక్రిందులై కారుతో పాటు మనంకూడా తునాతునకలై పోతామ్! జాగ్రత్త!

డ్రైవర్ : మరీ మంచిది. నేను ఎలాగో ఆత్మహత్య చేసుకుందా మనుకుంటున్నాలెండి.

ఎల్. వెంకటేశ్వర్లు, గుంటూరు.

---



కామధేనువు

—చిత్రకారిణి: శ్యామసుందరీ దేవి.

లేదు. శరీరంలో ఎప్పుడూ ఇలాంటి ఉత్తేజం కలగలేదు, మనసెప్పుడూ ఇలా పైకిలేచి పోతున్నట్లు లేదు.

సుజాత "అక్కయ్యా" అని పిలిచింది. వాళ్ళు తిరిగి వచ్చారు.

"ఏమిటి మావాణ్ణి పాడలు గొట్టించేస్తున్నావ్. కెమిస్ట్రీ చెప్తున్నావా" అన్నాడు సుజాతతో కృష్ణమూర్తి.

సుజాత గలగలా నవ్వింది.

"ఇలాంటి నవ్వుకోసం ఏ ఆదర్శాన్ని వదులుకుంటేనేం? ఎంత త్యాగంచేస్తేనేం ...హృదయంలో నుంచి వచ్చే అమధురమైన ధ్వనికోసం ఆహుతయిపోతేనేం... కాదుకాదు, నేను పొరబడుతున్నాను... అన్నిటికన్న మనిషికి ప్రధానమైనవి "సిద్ధాంతాలు" ఆదర్శాలు కాదేమో! కానీ ఈ ఆదర్శాలేమిటి ఎందుకు, జీవితాదర్శం ఏమిటి? ఒక సిద్ధాంతంకోసం కృషిలో బలైపోవటమా; 'ఆనందం' పొందడానికి నిరంతరం అన్వేషిస్తూ వుండటమా..., ప్రశాంత వాతావరణం కల్పించుకొని సుఖించడమా: అసలు ఏది సుఖమిస్తుంది...ఏది...యేది? తాను ఒకదానితో ఒకటి కలిపి తికమకపడుతున్నాడు. ఒకదానితో ఒకదానికి పోటీ లేదేమో? తను సహజంగా బ్రతుకు సాగించడం లేదు. సహజంగా పెరగడం లేదు. అందరికన్న భిన్నంగా వుండాలని ఇలా అయిపోతున్నాడా...తన సిద్ధాంతం, తన వూహలు నిరాధారాలా...కాదు...అవన్నీ సరయినవే! తను 'తికమక' లో పడివున్నాడు. మామూలు స్నేహితుడికన్న కొంత సన్నిహితురాలు అర్ధాంగి! స్నేహితులవల్ల ....ఏం నష్టం? భార్య పిల్లలు కంటుందా. సంసారం పెద్దదిచేసి ఆర్థికపు వొడిదుడుకులు కలగజేసి శాంతి నశింపజేస్తుందా...ఇవన్నీ అదుపులోవుంచే వీల్లేదా...ఎందుకు వీల్లేదు. తన ఆలోచనలు సరయినదారిలో నడవటం లేదు. మొదట్నుంచీ తను చాల 'తికమక' లో వున్నమాట వాస్తవం...అవును...కాదు ...ఛా...ఛీ...'

ఇల్లు చేరుకొన్నారు. ప్రభాకరం ముఖం తీవ్రంగా వుండటంగమనించి దారిలో ఎవరూ మాట్లాడలేదు.

భోజనం పూర్తిచేశారు. ప్రభాకరంతప్ప మిగిలిన ముగ్గురూ నవ్వుకుంటూ మాట్లాడుతూనే వున్నారు. "స్వామీ! ఇంత చైతన్యానికి, ఇంత ఆనందానికి అనర్హుడను!" అనుకొన్నాడు ప్రభాకరం.

ఇక్కడ రెండురోజులూ రెండుక్షణాల్లా గడచిపోయాయి. కానీ ఒక జీవితకాలంలో పొందదగిన ఆనందాన్ని రెండుక్షణాల్లో పొందినంత సంభరితుడయ్యాడు ప్రభాకరం.

మూడోనాడు ఉదయం ప్రభాకరం ఊరికి బయలుదేరాడు.

స్టేషన్లో చేయి వూపుతూ సన్నగా నవ్వుతున్న సుజాత అతని మస్తిష్కంలో నృత్యం చేయనారంభించింది.

అతనామెను మరచిపోలేకపోయాడు.

"పెళ్లిగురించి నీ అభిప్రాయం ఏ కొంతయినా మారిందా?" అని కృష్ణమూర్తి రాశాడు.

"కొద్దిగా మార్చుకున్నాను" అని ప్రభాకరం జవాబు రాశాడు.

ప్రభాకరం తనెరిగిన కుటుంబజీవితాలను మరోసారి జ్ఞాపకానికి తెచ్చుకొన్నాడు. "తల్లిదండ్రులు తమ పిల్లల్ని ఎవ్వరూ కూడా సరిగా పెంచడంలేదు పిల్లలు నాశనమైపోతున్నారు. యావజ్జాతీ నీరసపడిపోతోంది. వారి శారీరక, మానసిక ఆరోగ్యాలు పాడయి 'భవిష్యత్ ప్రపంచం' చాల 'అనారోగ్యకరంగా' తయారయ్యే సూచనలు కనిపిస్తున్నాయి ఈతల్లిదండ్రుల్ని మేల్కొల్పాలి. 'కుటుంబ నియంత్రణం' అమలుపరచాలి. కుటుంబాల ఆర్థిక దుస్థితి బాగుపడటానికి అప్పుడు స్త్రీలుకూడా ప్రయత్నించవచ్చు. అవును దీనిగురించి వ్యాసాలు రాయాలి..." అనుకొంటూ ఇంతలో కృష్ణమూర్తికి ఉత్తరంలో రాశాడు.

ఒకరోజు క్యాంపునుంచి ఇంటికి వచ్చేసరికి కృష్ణమూర్తి ఉత్తరం వుంది.

"ప్రభాకరానికి,

నీ ఉత్తరం అందినది. చాల సంతోషం. నా ఆనందాన్ని అక్షరాల రూపంలో వ్యక్తపరచలేని నా అశక్తతకు చింతిస్తున్నాను. సుజాత ఇక్కడే ఒక ఆఫీసులో ఉద్యోగంలో ప్రవేశించింది. తనే ఇష్టపడి వాళ్ళ నాన్నగారికి ఇష్టంలేకపోయినా చేరింది. ఇప్పుడెవరూ ఆమెను నిందించటంలేదు నీవు కూడా ఈ వూరొచ్చేస్తే చాల బావుంటుంది. ఇంతకుముందు ఈ వూరు వేస్తామంటే 'వద్దని' అక్కడే వేయించుకొన్నావనుకొంటాను. ఇప్పుడీవూళ్ళో నీ ఉద్యోగం ఖాళీగానే వుంది. నువ్వు 'ఊ' అంటే వేసేస్తారనుకొంటాను.

సుజాత నీ పేరు మార్చేస్తుందట!

నీ ఉత్తరంకోసం చూస్తూ వుంటాను.

నీ

కృష్ణమూర్తి."

* * *

ప్రభాకరానికి కృష్ణమూర్తి వూరికి బదిలీ అయింది. 'పిల్లల పెంపకం' అన్న వ్యాసం రాసి ట్రంకులో వుంచుకొని ప్రభాకరం బయలుదేరాడు. సుజాతకోసం చేతులు చాచుకొని స్టేషన్లో దిగాడు. ★